

కథ

# కబాబ్ కపాలి

పలమనేరు బాలాజి

పలమనేరులో ఆరేడు కళ్యాణ మండపాలున్నాయి.

పాతపేటలో ఒకప్పుడు ఒక చిన్న సత్రం వుండేది. కానీ ఏవో గొడవలు, కోర్టు కేసుల వల్ల అది మూతబడింది.

ఇప్పుడిక ఎవరిదైనా పెండ్లి అంటే కొత్తపేటకు వెళ్ళాల్సిందే. నాలుగో నెంబరు హైవే దాటాల్సిందే. కపాలిని కలవాలంటే పాతపేటకు రావాల్సిందే.

ఎస్టీ కాలనీ వుండేదేమో పాతపేటలో, కళ్యాణ మండపాలన్నీ వున్నదేమో కొత్తపేటలో. కపాలి వుండేది ఎస్టీ కాలనీలోనే. ఒకప్పుడు కపాలి అంటే ఎవరికీ తెలియదు. ఇప్పుడు కపాలి అంటే అందరికీ తెలుసు. కబాబ్ కపాలి అంటే ఊర్లో చిన్న పిల్లలక్కూడా తెల్సి పోతుంది.

చికెన్ కబాబ్స్ చేయటంలో కపాలి నేర్పరి. వివాహాలకు, శుభ, అశుభ కార్యాలన్నింటికీ కపాలి వంట చేస్తాడు. శాఖహారమైనా, మాంసాహారమైనా వంటలు చెయ్యాలంటే ఊర్లోనే కాక, చుట్టుపక్కల మండలాల్లో సైతం జనం- ముందు కపాలికి వీలవుతుందేమో అని వాకబు చేస్తారు.

కపాలికి వీలు కాదంటే మరింకెవర్నయినా వెతుక్కుంటారు. కొంచెం పెద్దవాళ్ళయితే ఇంటికే అప్పుడప్పుడు కపాలిని పిలిపించుకుని కబాబ్స్, బిరియాని, తందూరి, ఫ్రైడ్‌రైస్, చికెన్ పకోడి, నాటుకోడి బిరియాని లాంటివి చేయించుకుంటూ వుంటారు.

కపాలికి అంత పేరు రావటం ఒక్క రోజులోనో, ఒక్క నెలలోనో జరగలేదు. వంటల మాస్టర్ అవటం కపాలి కలలో అయినా ఊహించని విషయం.

అదంతా అనుకోకుండా జరిగిపోయింది.

కపాలి టెంట్ హౌస్‌లో పని చేసేవాడు. భార్య విజయ. ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. కపాలి వాళ్ళ తాతది బాతుల వ్యాపారం. తండ్రిది పందుల వ్యాపారం. కపాలి ఆ రెండింట్లో దేన్నో ఒకదాన్ని ఎంచుకోవాల్సింది పోయి- ఇంట్లో గొడవపడి ఏదో చిన్న విషయానికి అలిగి ఇంట్లో దొరికినంత డబ్బు తీసుకుని మద్రాసుకు పారిపోయాడు.

పదహైదు సంవత్సరాలు ఎక్కడెక్కడో తిరిగి, ఎట్లాగో బతికి- విసుగొచ్చి, తిరిగి తిరిగి ఇంటికొచ్చేనాటికి తాతా లేడు, తండ్రి లేడు. బాతులూ లేవు, పందులూ లేవు. ముగ్గురు అన్నలు ఆస్తులు పంచుకునే క్రమంలో బాతుల్ని, పందుల్ని భాగం పెట్టుకుని వేరు కుటుంబాలు పెట్టుకునేసారు.

ఇక రాడేమో అనుకున్న కపాలి రావటం ఎవరికీ నచ్చలేదు. అతడి రాకను ఎవరూ ఇష్టపడలేదు. కపాలి కుల పంచాయతి పెట్టించాడు.

రెండు రాత్రులు, మూడు పగల్లూ సాగింది పంచాయతి. ఎరుకల కుల పెద్దలంటే మాటలు కాదు. నాటు సారా, పంది మాంసం పంచాయతి పెద్దలకు ఇరు పక్షాలు పంచాయతి జరిగినంత కాలం సమర్పించు కోవాల్సిందే.

అన్నలు ముగ్గురూ అప్పులు చూపించారు. మొన్నటిదాకా బతికి రోగంతో చనిపోయిన తల్లికి ఖర్చులు చూపించారు. పంచాయతి పెద్దలు వాళ్ళ ముగ్గురికే వత్తాసు పలికారు. మూడు వేల రూపాయలు కపాలి భాగం కిందకి వస్తుందని లెక్క తేల్చి మూడు వాయిదాల్లో ఆ మొత్తాన్ని అతడికి అన్నలు అప్పగించాలని తీర్పునిచ్చారు. ఆ మూడో వాయిదా సొమ్ము చేతికందేసరికి జరిగిన ఆరు పంచాయితీలకు వెయ్యి రూపాయలు ఖర్చయిపోగా అతడికి నికరంగా చేతికొచ్చింది రెండు వేలే.

అదీ అతడికి మిగిలిన ఆస్థి. అదే అతడి పెట్టుబడి.

టెంట్‌హౌస్‌లో కరీముల్లా దగ్గర పనికి చేరిపోయాడు కపాలి.

షామియానా, కుర్చీలు, మైక్‌సెట్, వంటపాత్రలు బాడుగకు తిప్పి పందిళ్ళు, షామియ్యానాలు వేసే పనిలో ఆరితేరిపోయాడు. కరీముల్లాకు బాగా దగ్గరయిపోయి రెండో కరీముల్లా అని పిలిచే స్థాయిలో షాప్‌లో దొంగతనం జరిగింది. ఇరవై వేలు డబ్బు గల్లాపెట్టెలోంచి మాయమైంది. ఎంతో నమ్మకంగా పని చేసినచోటే దొంగ అనే ముద్ర పడింది. మూడు రోజులు వరుసగా పోలీస్ స్టేషన్‌లో తిన్న లాఠీ దెబ్బలకు అతడి ఒళ్ళు హూనమైపోయింది.

"ఇల్లూ లేదు, వాకిలి లేదు. ఆలీ బిడ్డల్లేరు బాయీ. రాత్రి పగలు నీ పంచనే పడిందాను. నా సంపాదన కూడా నీ దగ్గరే దాచుకుంటా వుండా. నేను నీ దగ్గర దొంగతనం చేస్తానని ఎట్లా అనుకున్నావు భాయ్" అంటూ వల వలా ఏడ్చేసాడు కపాలి.

పోలీసుల దెబ్బలకన్నా కరీముల్లా మాటలే ఇప్పటికీ నొప్పి కలిగిస్తా వుంటాయని అంటాడు కపాలి.

"జాతిబుద్ధి యాడ పోతుందిరా, విశ్వాసం లేని పని చేసినావు కదరా" అనేసాడు కరీముల్లా.

"బాయ్! నమ్మితే ప్రాణమిచ్చే జాతి బాయ్ మాది. గురువు కాని గురువడిగితే గురుదక్షిణగా బొటనవేలే కోసిచ్చిన ఎరుకల జాతి

**అందరి దగ్గరా మంచి పనివాడు, మంచి వంటవాడు అనిపించు కున్న కపాలి, బీడి తాగటం, వక్కాకు నమలటం లాంటి అలవాటయినా లేని కపాలికి ఉన్నట్లుండి ఎప్పుడు ఎట్లా మొదలయ్యిందో కానీ తాగుడు అలవాటయిపోయింది. కుదురుగా వంట పనులకి పోవడం మానేశాడు.**

బాయ్. నన్ను విశ్వాసంలేని వాడంటావా? బుద్ధుంటే నీ ముఖం చూడనీ జన్మలో" అనేసాడు.

నాలుగో రోజో, ఐదో రోజో నిజం తెల్సిపోయింది. డబ్బు దొంగలించినవాడు కరీముల్లా తమ్ముడే. క్లబ్బులో పేకాడుతూ పోలీసులకు డబ్బుతో సహ దొరికిపోయినప్పుడు అంత డబ్బు ఎక్కడిదని పోలీసులు నాలుగు తగిలించేసరికి నిజం కక్కేసాడు.

అదే కరీముల్లా స్టేషన్‌కు స్వయంగా వచ్చి చేతులు పట్టుకుని బ్రతిమలాడుకున్నా కపాలికి తగిలిన లోపలి గాయం మానలేదు.

స్టేషన్‌లోంచి బయట పడిన తర్వాత నేరుగా ఎస్టీ కాలనీలోకి వచ్చేసాడు. వరుసకి తాత అవుతాడు దేవరాజులు. బంగ్యాకు తాగుతూ ఎప్పుడూ మత్తులో ఉండిపోతాడు. తత్వాలో, పాటలో ఏమిటో గాలిపాటలు పాడుకుంటూ వుంటాడు. ఒంటరి జీవి. అతడి గుడిసెలో చేరిపోయాడు కపాలి.

అప్పటిదాకా హోటల్లో తిండికి అలవాటు పడినవాడు కాస్తా గుడిసెలోకి రాగానే పుల్లలు ఏరుకుని వచ్చి పొయ్యి అంటించి కుండ పెట్టి వండటం నేర్చుకున్నాడు. అట్లా మొదలైన వండటం... వంటవాళ్ళ దగ్గర చేరి చిన్నా చితక పనులు చేస్తూ క్రమంగా వంట మాస్టర్ అయిపోయాడు.

అప్పటికి ఎస్టీ కాలనీలోనే ఎవరూ వంటవాళ్ళు లేరు. ఆ మాట కొస్తే పాతపేటలోనే వంటవాళ్ళు లేరు. మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డాడు. కానీ కరీముల్లా దగ్గర తను దాచుకున్న సొమ్ము గుడిసెను మార్చి వేసుకోవటానికి, కొంచెం మంచి బట్టలు కుట్టించుకుని గరిటలు మిగతా వంట సామాగ్రి కొనుక్కోవటానికి ఉపయోగపడింది.

అయినా ఎరుకలోడేంది? వంటలు చెయ్యడమేంది? అని మొదట్లో సందేహపడి, మొహమాటాలకు, నిష్టూరాలకు పోయిన జనమే అతడి వంట ఒకసారి రుచి చూసాక, కపాలి చేతిలోని మహత్తు తెలిసాక కులం గురించి మాట్లాడ్డం మానేసారు.

పని కోసం ఎక్కడెక్కడో తిరిగి ఎవరెవరి ముందో చేతులు కట్టుకుని నిలబడిన కపాలి దగ్గర ఇప్పుడు శిష్యరికం చేయటానికి పోటీలు పడి వచ్చే జనం ఎందరో!

"కుల వృత్తి కాదు కదరా ఎట్లా నేర్చుకున్నావ్ ఈ విద్య?" అని ఎవరైనా మొహంపైనే అడిగినప్పుడు కపాలి నవ్వేస్తాడు.

అదేమన్నా అట్లంటావు? కుదురుగా కూర్చొని మనసుపెట్టి చెయ్యాల్లకానీ ఏ పనయినా మనిషికి లొంగకుండా వుంటుందా? కులందేమన్నా గుణం ముఖ్యంకదా. కృష్ణమాచారి చేసే మంచంకన్నా మనూర్లో మాలపాళ్యం జాకబ్ చేసే మంచాలకే గిరాకీ ఎక్కువ కదన్నా. కోమిటోళ్ళు, గాండ్లోళ్ళు బంగారం అంగడ్లూ, బట్టలంగడ్లూ పెట్టుకుని జరపతా వుండలేదా? రెడ్లూ, నాయుడ్లు హోటళ్ళు పెట్టుకోలేదా?" అని ఉదాహరణలతో సహ వివరంగా జవాబు చెప్పేస్తాడు.

అందరి దగ్గరా మంచి పనివాడు, మంచి వంటవాడు అనిపించు కున్న కపాలి, బీడి తాగటం, వక్కాకు నమలటం లాంటి అలవాటయినా లేని కపాలికి ఉన్నట్లుండి ఎప్పుడు ఎట్లా మొదలయ్యిందో కానీ తాగుడు అలవాటయిపోయింది. కుదురుగా వంట పనులకి పోవడం మానేశాడు.

పెండ్లి చేసుకోరా అంటే వినలేదు.

ఇల్లు కట్టుకోరా అంటే వినలేదు.

తాగుడు మానెయ్యారా! మంచిది కాదు అంటే వినలేదు.

ఇన్నాళ్ళూ లేని గొడవల్ని తాగడం మొదలుపెట్టినాక ప్రారంభించాడు. వాళ్ళ అన్నల ఇండ్ల దగ్గరకు వెళ్ళటం గొడవ పడటం ఎక్కువైపోయింది.

ఆ గొడవల కారణంగా మళ్ళీ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి వారం వుండి దెబ్బలు తిని వచ్చాడు. వారం రోజులు స్టేషన్‌లో వుండి తాగుడుకు దూరంగా వుండటం వల్ల చేతిలో సొమ్ము తాగుళ్ళకి, పంచాయతీలకి అయిపోవటం వల్లా మళ్ళీ తాగుడు జోలికి పోకుండా వుండిపోయాడు.

"ముందా గుడిసెలోంచి బయటికొచ్చెయి. ఈ ముసిలోడు నీకు బంగ్యాకు కూడా నేర్పించేస్తాడు. యాడైనా ఇల్లు బాడుక్కి తీసుకుని పెండ్లి చేసుకోరా... బాగుపడతావ్" అని నచ్చచెప్పించి పక్కింటామె.

అదే మాట చాలా మంది అతడితో అన్నారు.

నవ్వేసి ఊరుకున్నాడు కపాలి. పనిస్తానని కరీముల్లా నాలుగైదు మార్లు కబురు పంపినా కదల్లేదు.

కపాలికి ఇప్పుడు మళ్ళీ కష్టకాలం మొదలయ్యింది.

ఇంతకు ముందులాగా అతడ్ని అందరూ వంట పనులకు పిలవటం లేదు. అతడు వంట నేర్పించిన శిష్యుల్లో కొందరు ఈ మధ్య కాలంలో కొత్త వంట మాస్టర్లైపోయారు.

"కపాలి మంచి పనోడే కానీ తాగుబోతు. తాగి వంట ఎక్కడ చెడగొడతాడో లేదా ఎక్కడెవర్తో గొడవ పడతాడో కపాలి వద్దులేబ్బా. వంటలో ఉప్పూ కారం కొంచెం ఎక్కువైనా పర్వాలేదు, తగ్గినా పర్వాలేదు కానీ, మొత్తం వంటంతా నాశనమైపోతే కార్యం మొత్తం చెడిపోతుంది. కపాలికో దండమప్పా. తాగుబోతులతో ఎక్కడ ఏగతాం?" అనేవాళ్ళ సంఖ్య పెరిగిపోయింది.

ఎవరైనా పొరబాటున పిలిచినా కపాలి పనికి పోకుండా వస్తులైనా వుండిపోతున్నాడు.

కబాబ్ కపాలికి ఇప్పుడు చేతిలో పని లేదు. అవసరాలకి వంట పాత్రలు, గరిటెలు కూడా అయినకాడికి అమ్ముకునేసాడు. అతడి దగ్గర పని నేర్చుకోవాలనో, పనులు చెయ్యాలనో వచ్చేవాళ్ళే లేరిప్పుడు. మొండిగా, పంతంగా అట్లానే రోజుల్ని నిర్లక్ష్యంగా నెట్టుకొస్తున్న కపాలి ఒకానొక దినం జన్మలో ముఖం చూడనని ముఖంపైనే తను చెప్పేసిన కరీముల్లా దుకాణం ముందు కాళ్ళకు చెప్పులైనా లేకుండా నిలబడ్డాడు.

లోతుకు పోయిన కళ్ళు, చిక్కిన శరీరం, పెరిగిన గడ్డం, తైల సంస్కారం లేని ఆ మనిషిని- ముందు కరీముల్లా గుర్తుపట్టనేలేదు. గుర్తు పట్టాక లోపలికి పిలిచాడు.

"ఏరా డబ్బులేమైనా కావాలా? ఏమైంది? ఎందుకిట్లా అయిపోయావ్, పని పాటా లేకుండా పాపర్ అయిపోయినావ్ కదరా? ఏం రా! ఈ దినం ఇట్లా వొచ్చినావ్, ఈ దినం గుర్తుకొచ్చినానా?" కరీముల్లా ప్రశ్నతో తల గోక్కున్నాడు కపాలి.

"బాయ్ ప్రాణం పోయినా... నీ ముందుకే రాకూడదనుకున్నా. ముసిలోడు సచ్చేట్లు వుండాడు. అన్నం పెట్టి నీడనిచ్చినోడ్ని చూస్తా ఎట్లా సంపుకునేది? వాడు బతికినంత కాలం వానికి అన్నం పెట్టల్ల భాయ్ అది నా ధర్మం. అదే న్యాయం. నాకేదైనా పని చూపించు" కళ్ళనీళ్ళ పర్యంతమయిపోయాడు కపాలి.

•

## డాక్టర్ నోముల కథల పోటీ

'డాక్టర్ నోముల సత్యనారాయణ కథ'ల పోటీకి రచయితలు/ రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం. పోటీలో ఉత్తమ కథలుగా ఎంపికైన ప్రథమ, ద్వితీయ, తృతీయ కథలకు- నల్లగొండలో జరిగే కార్యక్రమంలో రచయితలకు నగదు బహుమతులు అందజేస్తాం. అక్టోబర్ 31, 2009వ తేదీలోగా రచయితలు/ రచయిత్రులు తమ కథలను కింది చిరునామాకు పంపించాలి.

చిరునామా: ఎన్.ఎస్.రాహుల్, కేరాఫ్ నోముల సత్యనారాయణ, రవీంద్రనగర్, నల్లగొండ.

– ఎన్.ఎస్.రాహుల్, ఎలికట్టె శంకర్‌రావు